‘ఫ్రీబస్’కు మరో ఆటో డ్రైవర్ బలి

- నడుస్తున్న రైలు కింద పడి ఆత్మహత్య
- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఘటన

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ సర్కారు తెచ్చిన ‘మహాలక్ష్మి’ పథకం మరో ఆటో డ్రైవర్‌ను బలితీసుకున్నది. ప్రయాణికులు లేక.. గిరాకీ రాక.. బతుకు భారమై.. కుటుంబ పోషణ కష్టమై ఓ ఆటోడ్రైవర్ తనువు చాలించాడు. ఈ ఘటన బుధవారం మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకున్నది. జిల్లా కేంద్రంలోని బొక్కలోనిపల్లికి చెందిన పిచ్చికుంట్ల దేవేందర్ (23) ఆటో నడుపుతూ కొన్నేండ్లుగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి.. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో మూడు నెలలుగా ఆటోకు గిరాకీ రావడం లేదు. అప్పటికే ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఆటో డ్రైవర్‌కు కుటుంబ పోషణ భారమైంది. చేసేది లేక.. బుధవారం సాయంత్రం బండమీదిపల్లి సమీపంలో రైల్వే ట్రాక్‌పై వస్తున్న రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ తెలిపారు.

కరెంట్ షాక్‌తో మరో రైతు మృతి

- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఘటన

ధరూరు, ఫిబ్రవరి 28 : బోరు మోటర్ ఆన్ చేసేందుకు వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ధరూర్ మండలం నెట్టెంపాడుకు చెందిన యువ రైతు లొడ్డ తిప్పన్న అలియాస్ రాజేశ్ (30)కు భార్య రాజేశ్వరి, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయనకున్న రెండెకరాల్లో పంటలు పండిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం ఉదయం 11 గంటలకు వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడ బోరు మోటర్ ఆన్ చేసిన అనంతరం మోటర్ పైప్ వద్దకు వెళ్లి కేసింగ్ పైప్‌పై ఉన్న ఐరన్ కప్లింగ్‌ను పట్టుకున్నాడు. అప్పటికే కేబుల్ వైర్ కట్ అయి ఉండగా.. గమనించకపోవడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. స్థానిక రైతులు గుర్తించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఏరియా దవాఖానకు తరలించారు. పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది.

కరెంట్ పోలేదు.. మైకుదే ఫాల్ట్!

- ఎస్పీడీసీఎల్ వితండవాదం
- కేటీఆర్ సభలో కరెంట్ కోతపై వింతైన వివరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ‘యథారాజా.. తథాప్రజా..’ ఈ సామెత విద్యుత్తు శాఖకు సరిగ్గా సరిపోతుంది. ఒకవైపు ప్రభుత్వం విద్యుత్తు కోతలు లేవు.. నిరుటి కంటే ఎక్కువే విద్యుత్తును సరఫరా చేస్తున్నామంటూ హూంకరిస్తుంటే.. విద్యుత్తు సంస్థల అధికారులూ అదే బాటలో నడుస్తున్నారు. అందుకే వింతైన వితండవాదానికి దిగుతున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ నాగర్‌కర్నూల్‌లో జరిగిన బీఆర్‌ఎస్ సభలో ప్రసంగిస్తుండగా, కరెంట్ సరఫరా నిలిచిపోయిందంటూ ఈ నెల 26న ‘నమస్తే తెలంగాణ’లో వార్త ప్రచురితమైంది. దీనిపై విచారించిన ఎస్పీడీసీఎల్ అధికారులు అసలు కరెంటు సరఫరా నిలిచిపోలేదని, మాజీ మంత్రి కేటీఆర్ ఉపయోగించిన మైక్ సిస్టంలో లోపం కారణంగానే అలా జరిగిందని, ఇది ఆ వీడియోలో స్పష్టంగా ఉన్నదంటూ ఎస్పీడీసీఎల్ సీజీఎం (ఓఅండ్ఎం) బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ దేశికట్లలోని బీఆర్‌ఎస్ భవన్‌లో ఈ నెల 25న జరిగిన సభా ప్రాంగణానికి విద్యుత్తు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌కు రెండు కనెక్షన్లు ఉన్నాయని, ఆ రోజు సదరు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎలాంటి కరెంట్ సరఫరా నిలిచిపోలేదనే విషయం నాగర్‌కర్నూల్ ఎస్‌ఈ విచారణలో తేలిందంటూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేతన్నలను ఆదుకోండి

- బతుకమ్మ చీరల బకాయిలు విడుదల చేయండి
- చేనేత పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలి
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మలకు కేటీఆర్ ఫోన్

సిరిసిల్ల పరిధి పెద్దూరులో దుబాయ్ జైలు బాధిత వ్యక్తులు, వారి కుటుంబాలతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ చీరల బకాయిలు వెంటనే విడుదల చేసి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సిరిసిల్ల పర్యటనకు వచ్చిన ఆయనను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వస్త్ర ఉత్పత్తిదారులు, ఆసాములు కలిశారు. మరమగ్గాల పరిశ్రమ సంక్షోభం, నేత కార్మికుల ఉపాధి అవకాశాలపై వారితో చర్చించారు. సమావేశంలో నుంచే చేనేత, జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కలకు ఫోన్ చేసి నేతన్నల ఉపాధి, పరిశ్రమ సంక్షోభంపై నెలకొన్న పరిస్థితులను వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రులు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నేతన్నల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగించాలని కోరారు. కార్మికులు, ఆసాములు, యజమానులకు తాను అండగా ఉంటానని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ‘కాళేశ్వరం కావాలె కానీ, బీఆర్‌ఎస్‌ను బద్నాం చేయాలె’ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వ విమర్శలను తిప్పికొడుతూ ముద్రించిన కరపత్రాలను పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఎల్లారెడ్డిపేట మండలం జగదాంబ తండాకు చేరుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌కు హాజరై ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరుకు చేరుకుని ఇటీవల దుబాయి జైలు నుంచి విడుదలై వచ్చిన శివరాత్రి మల్లేశం, రవి కుటుంబాలను, అక్కడికే వచ్చిన చందుర్తికి చెందిన దండుగుల లక్ష్మణ్, జగిత్యాల జిల్లా మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు కుటుంబాలను పరామర్శించారు. దుబాయికి పోతున్న వారు నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా కేటీఆర్ సూచించారు. నకిలీ ఏజెంట్ల మోసాల వల్ల కలివెల్లి అయి గల్ఫ్‌లో పడరాని పాట్లు పడుతున్నారని తెలిపారు. 18 ఏండ్లు జైలు జీవితం గడిపి వచ్చిన వారి జీవితాలే ఉదాహరణగా తీసుకోవచ్చని అన్నారు. జైలులో ఉన్న వారి గురించి తెలియగానే.. వారి విడుదల కోసం కృషి చేసినట్టు చెప్పారు. తెలంగాణలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని ఇక్కడే కుటుంబాలతో కలిసి ఉండాలని సూచించారు. దుబాయి జైలు నుంచి వచ్చిన వారికి అండగా ఉంటానని, ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకునేలా తనవంతు కృషి చేస్తానని ఆ కుటుంబాలకు భరోసానిచ్చారు. గల్ఫ్ బాధితులకు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

‘అన్నా.. మీ దయవల్లే గల్ఫ్ బాట వీడిన’

ఎంబీసీ నిధులు రూ.లక్షతో ఆటో కొనుక్కొని జీవిస్తున్న తన అభిమాని, సిరిసిల్లకు చెందిన మల్యాల దేవరాజ్‌ను కేటీఆర్ అభినందించారు. సిరిసిల్లలో క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేసి తిరుగు ప్రయాణంలో కారెక్కుతున్న కేటీఆర్‌ను ‘నమస్తే అన్నా’ అంటూ దేవరాజ్ పలుకరించాడు. వెంటనే కారు దిగి ‘బాగున్నావా తమ్మీ’ అంటూ కేటీఆర్ అడిగారు. ‘అన్నా, మీ దయవల్లనే ఆటో కొనుక్కుని మంచిగ బతుకుతున్నా’ అంటూ సంతోషంతో సమాధానం ఇచ్చాడు. ‘ఇక్కడ పనిలేక ఆరేండ్లు గల్ఫ్‌కు పోయా. మీ ప్రభుత్వంలో ఎంబీసీ పథకం కింద మీరిప్పించిన రూ.లక్షతో సెకండ్ హ్యాండ్ ఆటో కొనుక్కుని కుటుంబాన్ని పోషించుకుంటున్న’ అని చెప్పాడు. ఒకసారి నా ఆటోలో కూర్చుంటే నా జీవితం ధన్యమవుతుందని’ దేవరాజ్ కోరగా, కేటీఆర్ వెంటనే ఆటో ఎక్కారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడితో కలిసి ఆటోలో కొంత దూరం ప్రయాణించారు.

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎవరు?

- కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి దాదాపు ఖరారు
- పరిశీలనలో ఇతరుల పేర్లూ..
- బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఉండటంతో పాలకపక్షానికి అగ్నిపరీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల కోటాలో శాసనమండలికి ఎన్నికల నగారా మోగడంతో అభ్యర్థి ఎవరన్నది జోరుగా చర్చ జరుగుతున్నది. బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన, పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఈయన అభ్యర్థిత్వం దాదాపు ఖాయమైనట్టేనని మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. మహబూబ్‌నగర్ ఎంపీ, ఎమ్మెల్సీలుగా ఒకే సామాజిక వర్గానికి ఎలా ఇస్తారని ఏవైనా అభ్యంతరాలు వ్యక్తమైతే తప్ప జీవన్‌రెడ్డి అభ్యర్థిత్వం దాదాపు ఖాయం అయినట్టేనని ఈ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

రేవంత్‌వి అపరిపక్వవ్యాఖ్యలు

- బీఆర్‌ఎస్వీ నేత తుంగబాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఒక్క సీటు కూడా గెలువనివ్వనని ప్రగల్భాలు పలకడం సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ అపరిపక్వతకు అద్దంపడుతున్నదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు తుంగబాలు విమర్శించారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిలా కాకుండా ప్రతిపక్ష నాయకుడి మాదిరిగా వ్యవహరిస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 420 హామీలను అమలు చేయలేక రేవంత్‌రెడ్డి ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ కనీసం 50 స్థానాలు కూడా గెల్చుకోలేని స్థితిలో సర్కస్‌ఫీట్లు చేస్తున్నదని ఎద్దేవా చేశారు.

రేవంత్ అది నోరేనా?

- సీఎంగా ఉండి.. ఇదేం జుగుప్సాకర భాష?
- హామీలు అమలు చేసే చేవలేకనే బీఆర్‌ఎస్‌పై దాడి
- ఆరు గ్యారెంటీల్లోని 13 హామీలు అమలు చేయాలి
- రాజకీయాలకు మగతనంతో సంబంధమేంటి?
- 17 గెలిచి మగతనం నిరూపించుకో
- రాష్ట్రానికి సీఎం అనే సోయితో మాట్లాడాలి : ఎమ్మెల్యే కడియం

హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి. చిత్రంలో ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్

వరంగల్, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మగతనం గురించి జుగుప్సాకరమైన భాష మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 17 సీట్లు గెలుచుకొని తన మగతనం నిరూపించుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేక, ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్‌రెడ్డి జుగుప్సాకరమైన భాషతో ప్రతిపక్ష పార్టీపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో మగతనం ఎందుకు వస్తుందో అర్థం కావడం లేదని, రాజకీయాలకు మగతనానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. బుధవారం ఆయన హనుమకొండలో మీడియాతో మాట్లాడుతూ.. సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ ఇద్దరూ మహిళలేనని, వారి నాయకత్వంలో పనిచేస్తున్న రేవంత్‌రెడ్డి పదేపదే మగతనం గురించి మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో మగతనం గురించి మాట్లాడుతున్న రేవంత్ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, ప్రియాంకగాంధీని కూడా అవమానిస్తున్నారని పేర్కొన్నారు. రేవంత్ ఎంపీగా ఉన్న మల్కాజిగిరి పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కచోట కూడా కాంగ్రెస్‌ను గెలిపించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో 17 సీట్లు గెలుచుకొని మగతనం నిరూపించుకోవాలని సవాల్ చేశారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టడానికే మేడిగడ్డకు బీఆర్‌ఎస్ వెళ్తున్నదని స్పష్టం చేశారు. రేవంత్ ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అనే విషయం గ్రహించి భాష మార్చుకోవాలని హితవు చెప్పారు. ముఖ్యమంత్రిని అనే సోయి లేకుండా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజురోజుకు సహనం కోల్పోయి ప్రతిపక్షంపై దాడి చేస్తున్నారని, గత సీఎంపై పరుషపదజాలం ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలపై మాట్లాడుతున్న వారిపై దాడులు చేస్తున్నారని, సీఎం రేవంత్ తీరు జుగుప్సాకరంగా ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి సీఎంగా కాకుండా తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవు చెప్పారు.

పథకాలను వైఫల్యాలుగా చిత్రీకరించొద్దు

గత పదేండ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారని, కేంద్ర ప్రభుత్వంతోపాటు అంతర్జాతీయ సంస్థల మెప్పు పొందారని కడియం శ్రీహరి వివరించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రతి పల్లెకు, గూడేనికి రక్షిత మంచినీరు అందించిన కేసీఆర్ పాలనా దక్షతను ప్రశంసించకపోయినా ఫర్వాలేదు గానీ గత ప్రభుత్వం అమలుచేసిన పథకాలను వైఫల్యాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేయొద్దని హితవు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిత్యం కేసీఆర్‌పై, గత ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూ తెలంగాణ ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో దిగజార్చుతున్నారని మండిపడ్డారు. ఇది ఇలాగే కొనసాగితే తెలంగాణ రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ మాత్రమే కాదని, రూ.93 కోట్ల ప్రాజెక్టులో మేడిగడ్డకు పెట్టిన ఖర్చు రూ.3 వేల కోట్లు మాత్రమేనని స్పష్టంచేశారు. అందులో మూడు పిల్లర్లు మాత్రమే కుంగిపోయాయని, పిల్లర్లు కుంగిపోవడానికి సాంకేతిక కారణాలు, డిజైన్ లోపం, అధిక నీటి స్టోరేజ్ లాంటి అనేక సమస్యలు ఉండొచ్చని పేర్కొన్నారు. నిపుణులతో అధ్యయనం చేసి అసలు కారణాలను తేల్చాలని సూచించారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ రాజకీయం కోసమే వాడుకుంటున్నదని, రైతుల కోణం నుంచి కూడా ఆలోచించాలని హితవు చెప్పారు. గోదావరి నదిలో జూన్‌లో వరదలు వచ్చేలోగా మట్టికట్టను నిర్మించాలని సూచించారు. కాలయాపన చేసి వరదలు వచ్చినప్పుడు మొత్తం కొట్టుకుపోవాలనే దుర్మార్గమైన ఆలోచన చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలతో రైతులను ఆగం చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

మ్యానిఫెస్టోల అమలుపై చర్చకు సిద్ధమా?

ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు అమలు చేయలేక ముఖ్యమంత్రిలో అసహనం స్పష్టంగా కనిపిస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో అమలుపై, బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో అమలుపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా? అని కడియం శ్రీహరి సవాల్ విసిరారు. హామీల గురించి అడిగిన వారిపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీల్లో 13 హామీలు ఉన్నాయని, వంద రోజుల్లో అవన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2,500 సాయం హామీ నెరవేర్చలేదని, పింఛన్‌ను రూ.4 వేలకు పెంచలేదని విమర్శించారు. చేవెళ్ల సభలో రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని, సీఎం ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఇలా ఒకరి తర్వాత ఒకరు ఉండే కాంగ్రెస్ కుటుంబ పార్టీ కాదా? కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించింది కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కుటుం బ పాలన గురించి మాట్లాడితే ప్రజలు నవ్వుకుంటున్నారని, కాంగ్రెస్ వాళ్లు ఇంకా ఇందిరాగాంధీ నామస్మరణతోనే బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పేరుకే జాతీయ పార్టీ అని, అది ఏనాడో కుటుంబపార్టీగా, ప్రాంతీయ పార్టీ గా మారిపోయిందని విమర్శించారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు.

మీ అంతట మీరు కూలిపోతే మేము ఏమీ చేయలేం. రేవంత్ మాటలు తన కుర్చీని తాకొద్దని పక్కనున్న మంత్రులకు చెప్పినట్టుగా అనిపించింది. రేవంత్ సీఎం కుర్చీ ఇనాం కింద రాలేదు, వారసత్వంగా రాలేదు అంటున్నాడు. కచ్చితంగా సీఎం కుర్చీ నీకు ఇనాం కిందనే వచ్చింది. గాంధీ కుటుంబం రేవంత్‌రెడ్డికి సీఎం కుర్చీని ఇనాం కిందనే ఇచ్చినట్టు భావిస్తున్నం.

-కడియం శ్రీహరి,
మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే

బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్‌ఎస్ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్

సవాల్ విసిరే అర్హత రేవంత్‌కు ఉన్నదా?

- కాంగ్రెస్‌కు రాహుల్‌గాంధీని ప్రధానిగా ప్రకటించే దమ్ముందా?
- నమ్మిన ప్రజలకు శఠగోపం పెట్టారు
- అర్హులందరికీ పథకాలు అమలుచేయాలి
- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్‌కు సవాల్ విసిరే అర్హత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉన్నదా? అని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. గతంలో అనేకసార్లు సవాళ్లు విసిరి పారిపోయారని, ఇప్పుడు కొత్తగా సవాల్ విసురుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే రాహుల్‌గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి ఎన్నికల్లో పోటీ చేయాలని, దేశవ్యాప్తంగా కనీసం ప్రధాన ప్రతిపక్ష హోదాకు సరిపోయే సీట్లు తెచ్చుకోవాలని సవాల్ విసిరారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చేవెళ్ల సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాషను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు శఠగోపం పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలోని తెల్ల రేషన్‌కార్డుదారులందరికీ గ్యాస్ సబ్సిడీ పథకం, 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగిస్తున్నవారందరికీ ఫ్రీ కరెంట్ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అమలు చేయకుంటే ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం వైపు రేవంత్‌రెడ్డి నడిపిస్తున్నారని, తెలంగాణ ప్రగతిపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ కొట్టుకొనిపోవాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించినందుకు రేవంత్‌రెడ్డిని పొగడాలా? కాళేశ్వరం ప్రాజెక్టును పక్కన బెట్టినందుకు పొగడాలా? అని ఎద్దేవా చేశారు. నాలుగువేల పింఛన్, రైతు రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఏమయ్యాయని ప్రశ్నించారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీల మీద చర్చ జరగకుండా బూతు పురుణాలను అందుకుంటున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీలో మోదీ ఉంటే ఇక్కడ ఏడీ (అటెన్షన్, డైవర్షన్)గా రేవంత్‌రెడ్డి తయారయ్యారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, సచివాలయం, మేడారం జాతర, టీవీ ఇంటర్వ్యూలు ఎక్కడైనా రేవంత్‌రెడ్డి భాష ఒకేలా ఉంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మంత్రుల ఖాతాల్లోకి ప్రభుత్వ డబ్బు

తెలంగాణను బంగారుపల్లెంలో పెట్టి రేవంత్‌రెడ్డికి అప్పగిస్తే రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరులాగా మారుస్తున్నారని బాల్క సుమన్ విమర్శించారు. రైతుబంధు డబ్బులు మంత్రి పొంగులేటి ఖాతాల్లోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ఏయే కంపెనీలకు, కాంట్రాక్టు సంస్థలకు డబ్బులు చెల్లించారో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ చేశారు. రైతులు, పింఛన్‌దారులు, మహిళల ఖాతాల్లోకి వెళ్లాల్సిన డబ్బులను మళ్లించారని దుయ్యబట్టారు. రైతుబంధు డబ్బులు ఇవ్వాలని, మేడిగడ్డకు మరమ్మతులు చేయాలని, మెగా డీఎస్సీని వేయాలని, గ్రూప్- 2, గ్రూప్-3 నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులు, ఆటో డ్రైవర్లు, గురుకుల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల దురదృష్టం కొద్ది రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనాయక్ పాల్గొన్నారు.

రేవంత్ భాష జుగుప్సాకరం

- ఆయనకు సీఎం అనే సోయి లేదు
- సమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు
- ఆరు గ్యారెంటీలపై 600 కోట్లు
- రేవంత్ సీటును టచ్ చేసే వాళ్లు ఆయన పక్కనే ఉన్నారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆగ్రహం

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతి, కే వాసుదేవరెడ్డి, ఎల్ రూప్‌సింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిననే సోయి లేకుండా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, ఆయన భాష జుగుప్సాకరంగా ఉన్నదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా సీఎం మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. మహిళల గురించి అభ్యంతరకరంగా మాట్లాడటం ద్వారా సీఎం సంస్కారం, నీతి అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటూనే మహిళలను అగౌరవపర్చేవిధంగా సీఎం మాట్లాడారని దుయ్యబట్టారు. బుధవారం ఆమె తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం 600 కోట్లు పెడుతున్నదని, బడ్జెట్‌లో రూ.53 వేలు కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సవాలక్ష షరతులతో లబ్ధిదారులను తగ్గించే విధంగా నిబంధనలను విధించారని మండిపడ్డారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

పార్లమెంట్ ఎన్నికల కోసమే..

పార్లమెంట్ ఎన్నికల కోసమే హడావుడిగా గ్యాస్, ఉచిత కరెంటు పథకాలను ప్రారంభించారని సత్యవతి రాథోడ్ దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీల్లో 13 హామీలు ఉన్నాయని, మిగిలిన తొమ్మిది కూడా వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2,500 హామీ ఏమైందని ప్రశ్నించారు. రూ.500కే గ్యాస్ పథకాన్ని 40 లక్షల మందికే ఇస్తున్నారని మండిపడ్డారు. పురుషుల పేరు మీద ఉన్న గ్యాస్ కనెక్షన్లకు కూడా సబ్సిడీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులు, గిరిజనులకు 101 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇచ్చిందని గుర్తుచేశారు. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని డిమాండ్ చేశారు.

భాష మార్చుకో..

రేవంత్‌రెడ్డి పరుష పదజాలం మానుకోవాలని సత్యవతిరాథోడ్ సూచించారు. కేసీఆర్ కుటుంబాన్ని తిట్టడమే రేవంత్ ఎజెండాగా పెట్టుకున్నారని విమర్శించారు. రేవంత్ సీటును టచ్ చేసేవాళ్లు ఆయన పక్కనే ఉన్నారన్న విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందజేసిన ఉద్యోగ నియామకపత్రాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించినవి కావా? అని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. కౌలురైతులను ఏవిధంగా గుర్తిస్తారని, పండించిన పంటలకు బోనస్ ధర ఏమైందని ప్రశ్నించారు.

రేవంత్ నోరు అదుపులో పెట్టుకో: వాసుదేవరెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఒకటి కంటే ఎక్కువ సీట్లు గెలిస్తే రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేస్తారా? అని బీఆర్‌ఎస్ నేత కే వాసుదేవరెడ్డి సవాల్ చేశారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చేవెళ్ల సభలో ముఖ్యమంత్రి మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉన్నదని మండిపడ్డారు. రేవంత్ అండ్ కో నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌ను ఇష్టమొచ్చినట్టు తూలనాడటం మంచిది కాదని హితవుచెప్పారు.